# జమాతే ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ప్రారంభించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల మే 14(ప్రజా మంటలు) :** పట్టణ 35వ వార్డులో జమాతే ఇస్లామి హింద్ వారి ఆధ్వర్యంలో ఫారన్ క్లినిక్ లో మెడికల్ క్యాంపును ప్రారంభించిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, టి పి సి సి సెక్రెటరీ బండ శంకర్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ కౌన్సిలర్ లు అన్సారీ, ఆయుబ్ ఖాన్, జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షులు షోయబ్ ఉల్ హాక్ ,మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అహమ్మద్, ఫారూఖ్,నవీద్, జహీర్ అహమ్మద్, నాహీద్, తదితరులు పాల్గొన్నారు.

# "తెలంగాణ దళిత సాహిత్య చరిత్రను విస్మరించొద్దు" :బి.ఎస్. రాములు బహిరంగ లేఖ



**హైదరాబాద్ మే 14 (ప్రజా మంటలు):**తెలంగాణ సాహిత్య అకాడెమీ ప్రచురిస్తున్న పునాస ఏప్రిల్–జూన్ 2026 సంచికలో ప్రచురితమైన "తెలుగు సాహిత్యంలో అంబేద్కర్ ప్రభావం" వ్యాసంపై ప్రముఖ సామాజిక తత్వవేత్త, రచయిత, బీసీ కమీషన్ తొలి చైర్మన్ బి.ఎస్. రాములు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు కోయి కోటేశ్వరరావుకు బహిరంగ లేఖ రాశారు.1992 నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న దరకమే ఐక్య వేదిక కృషిని వ్యాసంలో పూర్తిగా విస్మరించారని ఆయన విమర్శించారు. పాట, కథ, కవిత, నవల, సాహిత్య విమర్శ వంటి విభిన్న ప్రక్రియల్లో 220కు పైగా పుస్తకాలు వెలువడిన విషయాన్ని ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు."ప్రవహించే పాట" వంటి ప్రముఖ పాటల సంకలనాలు, మాస్టర్ జీ రచనలు, తెలంగాణ దళిత సాహిత్య ఉద్యమంలో పాటల పాత్ర గురించి సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొన్నారు. "పాటలే ముందుగా ప్రజల్లోకి వెళ్లాయి. కానీ వ్యాసంలో వాటిని చివరన ప్రస్తావించడం సాహిత్య చరిత్ర అవగాహన లోపాన్ని సూచిస్తుంది" అని అన్నారు.తెలంగాణ దళిత సాహిత్య వికాసంపై సరైన అవగాహన లేకుండా వ్యాసం రాయడం, దాన్ని తెలంగాణ సాహిత్య పత్రిక ప్రచురించడం "కొత్త రూపంలోని సీమాంధ్ర ఆధిపత్య ధోరణికి ఉదాహరణ" అని బి.ఎస్. రాములు వ్యాఖ్యానించారు.తనపై గతంలో కోయి కోటేశ్వరరావు రాసిన విశ్లేషణాత్మక వ్యాసాన్ని కూడా గుర్తు చేస్తూ, "తెలంగాణ సాహిత్య చరిత్రపై మీ అవగాహన ఎంత ఉందో ఈ వ్యాసం ద్వారా బయటపడింది" అని పేర్కొన్నారు.అంతేకాక, "రెండో వ్యాసం రాయండి. ముందుగా నా ఇంటర్వ్యూ తీసుకోండి. ఆ తరువాత ఇతర రచయితలు, ఉద్యమకారులను కలుసుకుని వివరాలు సేకరించండి. అప్పుడే సమగ్ర చరిత్ర రాయగలుగుతారు" అని సూచించారు.

## మనస్థాపనకు చెంది ఎస్సారెస్పీ వరద కెనాల్ లో దుంకి ఆత్మహత్య



**ఇబ్రహీంపట్నం మే 14 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మృతురాలు గుండెల లక్ష్మి భర్త రాజన్న,59 సం.లు, కులం:యాదవ్, మృతురాలుకు ఇద్దరు కూతుర్లు ఒక కొడుకు కలరు, బుధవారం రోజున మధ్యాహ్నం సమయంలో మృతురాలికి మరియు ఆమె భర్త అయిన రాజన్న అను వారిద్దరికీ నువ్వులు ఇంటి బయట ఆరబెట్టుట విషయంలో చిన్న గొడవ జరగగా అట్టి గొడవకి మనస్థాపం చెందిన మృతురాలు గుండెల లక్ష్మి అను అమె ఇంట్లో నుంచి వెళ్లి కనిపించకపోగా ఆమె గురించి వెతుకుతుండగా తేదీ 14 5 2026 గురువారం రోజున ఉదయం 6 గంటల సమయంలో రాజేశ్వరరావుపేట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ వరద కెనాల్ లో దుంకి ఆత్మహత్య చేసుకుందని గుర్తించినారని, ఆమె మరణం పై ఎవరిపై ఎలాంటి అనుమానం లేదని మృతురాలు చెల్లె అయిన ఆసరీ గౌరు భర్త చిన్న మల్లయ్య, 52సం.లు,యాదవ్, గ్రామం చింతల్ పేట్ అను ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనేనది. ఎస్సై నవీన్ తెలిపారు.

# బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పథకాలను బ్రాహ్మణులు సద్వినియోగపరచుకోవాలి

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు





**బండ్లగూడ, నాగోల్ మే 14(ప్రజా మంటలు)** :తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పథకాలను బ్రాహ్మణ సద్వినియోగపరచుకోవాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ వైస్ చైర్మన్ పదవి బాధ్యతల స్వీకరణ ఉత్సవం గురువారం బండ్లగూడ, నాగోల్ వసంత విహార్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ము ఖ్య అతిథులుగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ కమిషనర్ హనుమంతరావు ,మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాల్ చారి ,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు, జగిత్యాల జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంఘన భట్ల దినేష్ తదితరులు పాల్గొని నూతనంగా పదవి బాధ్యతల స్వీకరణ మహోత్సవంలో పాల్గొని బ్రాహ్మణ పరిషత్తుకు నూతనంగా నియామకమైన తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ తదితరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి బ్రాహ్మణ సంఘాల బాధ్యులు, సభ్యులు విచ్చేసి సంక్షేమ పరిషత్ అధ్యక్ష కార్యదర్శులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ బ్రాహ్మణులు తమ వృత్తి ధర్మాన్ని సక్రమంగా పాటించినట్లయితే సమాజం వారిని గౌరవప్రదంగా చూస్తుందని పేర్కొన్నారు. లోక సమస్త సుఖినోభవంతు అంటూ బ్రాహ్మణులు సమాజానికి ఆశీస్సులు అందజేయాలని అన్ని వర్గాల సహకారంతో బ్రాహ్మణ వర్గాలు అభివృద్ధి చెందాలని అన్నారు. ఐక్యతతో ఉండి పరిషత్తు ద్వారా అందజేసే పథకాలను సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు .శాఖ బేధం లేకుండా అందరికీ సంక్షేమ పరిషత్తులో డైరెక్టర్లుగా అవకాశం కల్పించడానికి కృషి జరుగుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణ సంఘాలు, యువజన సంఘాలు తమ తమ పరిధిలో సేవలు అందిస్తున్నాయని సమాజంలో సేవలతోనే గుర్తింపు వస్తుందని అన్నారు .దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ తమ శాఖలో ఉన్నత పదవుల్లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారే ఉండడం వల్ల సహృదయంతో, ఉదారత భావంతో సమాజంలోని అన్ని వర్గాలకు సేవలు అందుతున్నాయని అన్నారు దేవదాయ శాఖలో మంత్రిగా పనిచేయడం తనకు ఎంతగానో సంతృప్తినిస్తున్నదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టెంపుల్ టూరిజం పేరిట బాసర ,భద్రాచలం వేములవాడ తదితర ఆలయాల నుండి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. పరిషత్ అధ్యక్ష ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తమపై విశ్వాసం ఉంచి పరిషత్ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సహకరించిన మంత్రి శ్రీధర్ బాబుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ తనమీద అభిమానంతో దూరప్రాంతాల నుంచి విచ్చేసిన బ్రాహ్మణ బంధువులకు తన అభిమానులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరు తమకే పరిషత్తు చైర్మన్ పదవి తమకి వచ్చింది అన్నట్లుగా భావించి కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రస్తుతం మన ముందున్న పెద్ద సమస్య ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించడం అని పెండింగ్లో ఉన్న నిధులను సైతం వచ్చేటట్లు చేసి పరిషత్తుకు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## మొక్కజొన్న కేంద్రం వద్ద టిప్పర్ దూసుకొచ్చి ప్రమాదంలో గాయపడిన రైతు కుటుంబానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆర్థిక సహాయం



**గొల్లపల్లి మే 14 ప్రజా మంటలు** :గొల్లపల్లి మండలం కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం అగ్గిమల్ల గ్రామానికి చెందిన రైతు గుడ్ల రాజయ్య జరిగిన టిప్పర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రాజయ్య చికిత్స కోసం 50 వేల ఆర్థిక సహాయాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుల ద్వారా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. రైతు కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిపారు ఈ సందర్భంగా స్థానిక రైతులు, గ్రామస్తులు మంత్రి సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు

## ఎన్నికల సిబ్బంది సమన్వయంతో ఓటర్ జాబితా సవరణను పారదర్శకంగా పూర్తి చేయాలిబిరాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి



**జగిత్యాల మే 14(ప్రజా మంటలు) :**ఎన్నికల సిబ్బంది ఓటర్ జాబితా సవరణను పారదర్శకంగా విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.రాబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై భారత ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) జిల్లా ఎన్నికల అధికారులతో (డీఈవోలు) గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ, ఈసీఐ నెట్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ఆర్ ఓలు, ఏఈ ఆర్ఓ లు, బి ఎల్ ఓలకు యాప్‌ను ఏ విధంగా ఉపయోగించాలి, వివరాలను ఎలా నమోదు చేయాలి, ఫీల్డ్ స్థాయిలో సమాచారం సేకరణ విధానం తదితర అంశాలపై అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు.అలాగే ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, వేగం మరియు సమన్వయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల అధికారులు పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో కిషన్, డి పి ఆర్ఓ పి. నరేష్, ఏడీఎం మమత, ఐటీ టీమ్ సభ్యులు మరియు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు. ఏ విధంగా ఉపయోగించాలి, వివరాలను ఎలా నమోదు చేయాలి, ఫీల్డ్ స్థాయిలో సమాచారం సేకరణ విధానం తదితర అంశాలపై అధికారులు సమగ్ర అవగాహన కల్పించారు.అలాగే ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, వేగం మరియు సమన్వయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ఎన్నికల అధికారులు పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో కిషన్, డి పి ఆర్ ఓ పి. నరేష్, ఏడియం మమత, ఐటీ టీమ్ సభ్యులు మరియు సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద డిగ్రీ కళాశాలలో మెగా హెల్త్ క్యాంప్

గాంధీ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు



**సికింద్రాబాద్ మే 14 (ప్రజా మంటలు):** విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో గురువారం మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – విద్యా సప్తాహంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు బిపి, షుగర్ వంటి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు.వివేకానంద కళాశాల హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్, జువాలజీ ప్రొఫెసర్ నీరజ చొరవతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, సైకియాట్రీ వంటి పలు విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలభాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రభు, గాంధీ వైద్యులు డాక్టర్ కరుణప్రియ, డాక్టర్ ప్రఫుల్, డాక్టర్ యశస్వినితో పాటు ఎంపీహెచ్ఓ వేణుగోపాల్ గౌడ్, రమాదేవి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ ఆరోగ్య పట్ల అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి



**గొల్లపల్లి మే 14ప్రజా మంటలు (అంకం భూమయ్య ):** ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామశివారులో బుధవారం రాత్రి చర్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన మృతుడు ఎరవెల్లి పర్శరాం 43 సం, టా -02-ఋ -1568 నెం గల కారును రోడ్డు పక్కన పార్క్ చేసి రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం డికొని మృతునికి బలమైన గాయాలు తో సంఘటన స్థలంలోనే మృతి మృతునికి కొడుకు,ఇద్దరు బిడ్డలు మృతుని భార్య గత నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయింది, గత నాలుగు నెలల నుండి కరీంనగర్ లో ఉంటూ సోడ బండి నడిపిస్తూ జీవిస్తున్నాడు, అని మృతుని తల్లి ఎరవెల్లి లింగవ్వ ఇచ్చిన దరఖాస్తు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి ఉదయ్ కుమార్, తెలిపారు

# ముత్తారంలో ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమం

ఇంటింటికీ వెళ్లి ప్రచారం



**ముత్తారం, మే 14( ప్రజా మంటలు):–** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు బుధవారం ప్రొ. జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ మాట్ల హరికుమార్, ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శరత్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లో ఉన్న సౌకర్యాలను వివరించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. పిల్లల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే మేలని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటారాక్టీవ్ ఫ్లాట్ పానల్స్‌తో భోదనా డిజిటల్ విద్యతో అద్భుత ప్రయాణం



**ఎల్కతుర్తి మే 14 ప్రజా మంటలు :** కార్పొరేట్ కు ధీటుగా మన ప్రభుత్వ బడి మెటీగా తెలంగాణ విద్యా వారోత్సవాల సందర్భంగా ఈ రోజు దండేపల్లి గ్రామంలో బడిబాట ర్యాలీ తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీ గోలిపెల్లి సంపత్ , ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కె.రమేష్ బాబు ఉపాధ్యాయులు శ్రీధర్, వెంకట రమణ, శ్రీనివాస్, కవిత, మల్లయ్య గారలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రాజిరెడ్డి, ఉమ గారలు, తల్లిదండ్రులు గంగాధర్ మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోలిపెల్లి సంపత్ మాట్లాడుతూ ఇదే పాఠశాల లో చదివిన నా భార్య పప్పుల శారదా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలుగా అయ్యారు, ప్రస్తుతం మన పాఠశాలో ఉన్న చదిరం శ్రీనివాస్ కూడా ఇదే పాఠశాలో చదివి ఉపాధ్యాయులు గా మన ముందు ఉన్నారు, ఇంకా 30మంది వరకు కూడా ఈ యొక్క పాఠశాలలో విద్యాని అభ్యసించి ఉపాధ్యాయులు గా స్థిరపడినారు, ఇంకొంతమంది డాక్టర్లు గా, ఇంజినిర్స్ గా, పోలీస్ గా, స్థిరపడినారు కావున ప్రభుత్వం పాఠశాలకు మీయొక్క పిల్లలను పంపిస్తే వాళ్లు కూడా గొప్ప వాళ్ళుగా స్థిరపడే అవకాశం ఉంది కాబట్టి మన దండేపల్లి ప్రభుత్వ పాటశాలకు పిల్లలను పంపండి అని చెప్పారు, ప్రభుత్వం కల్పించిన చేస్తున్న అనేక సౌకర్యాల గురించి తెలియ జేస్తూ, గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తల్లిదండ్రులను కోరారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో బడిబాట జడ్పిహెచ్ఎస్ వర్షకొండ లో




**ఇబ్రహీంపట్నం మే 14 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ ) :** ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ పాఠశాలలో బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసి గ్రామంలో ర్యాలీగా వాడవాడనా తిరుగుతూ బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉపాధ్యాయుల తల్లిదండ్రుల సమావేశాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాజేంద్ర అధ్యక్షత వహించారు. గ్రామ సర్పంచ్ ఫోనుకంటి వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ సి 2026 ఫలితాలను గూర్చి హెడ్మాస్టర్ వివరించారు. అందరూ సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ ఎస్ సి 2026 లో 542 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన బొబ్బిలి హాసిని,534 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన మద్దెనపల్లి వైష్ణవి లను గ్రామ సర్పంచు మరియు గ్రామపంచాయతీ పాలకవర్గం శాలువాలతో సత్కరించారు, ప్రధానోపాధ్యాయులు బి రాజేందర్ ని కూడా శాలువాతో సత్కరించారు. రానున్న విద్యా సంవత్సరంలో అధికంగా విద్యార్థులు నమోదు చేయిస్తామని ప్రధాన ఉపాధ్యాయుడు చెప్పారు, ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ కొనుకంటి చిన్న వెంకట్ మరియు వార్డ్ మెంబర్లు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయ భాస్కర్, శివ కృష్ణ, మమత, మాధురి, సుజాత, స్వామి, మహేష్, మల్లికార్జున్, నరేందర్ గారు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర నాలుగో4వ మహాసభలను జయప్రదం చేయండి



**ఎల్కతుర్తి మే 14 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రిక ఆవిష్కరణ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల కార్యదర్శి శనిగరపు రాజ్ కుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరు రాములు కర్రె లక్ష్మణ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గడ్డం రాజనర్స్ లు మాట్లాడుతూ 1943 లో కళా ప్రజల కోసం అనే ఆశయంతో బాలరాజ్ సహని పృథ్వీరాజ్ కపూర్ ముల్కరాజ్ ఆనంద్. హరీష్ ఆధ్వర్యంలో బొంబాయిలో (ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్) స్థాపించబడినది ఇదే సంవత్సరం ఆంధ్రప్రదేశ్లో కు అనుబంధంగా ప్రజానాట్యమండలి ఏర్పడింది ప్రజా సమస్యలను కళారూపాలుగా రూపొందించి ప్రజలలో చైతన్యం కలిగించడం గ్రామీణ ప్రజల జీవితాలకు ప్రతిబింబాలైన జానపద కలలను తీర్చిదిద్దడం తన ధ్యేయంగా పెట్టుకుంది ప్రజానాట్యమండలి ఆనాడు యుద్ధ జ్వాలల్లోకీడ్చిన హిట్లర్ పాసిజాన్ని నిరసిస్తూ పాటలు నాటికలు యక్షగానాల ద్వారా చైతన్యవంతం చేసింది ప్రజానాట్యమండలి నిజాం నిరంకుశ పాలకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల వీరోచిత పోరాటానికి నీడలా పనిచేసింది మాభూమి ముందడుగు నాటకాలు కష్టజీవి బుర్రకథ ఆ రోజుల్లో తెలంగాణ ప్రజలను ఉగ్రూతలూగించి పోరాట దళాలను ఉరికింపజేశాయి ఆ కారణాన్నే1948 ఆనాటి పాలకుల నిషేధానికి గురైంది ప్రజానాట్యమండలి ఆనాడు ప్రజానాట్య మండలి వెలికి తీసిన మట్టిలో మాణిక్యాలే ప్రముఖ కళాకారులు డాక్టర్ రాజారావు తాతినేని ప్రకాశరావు చలపతిరావు అల్లు రామలింగయ్య మోహన్ దాస్ నాజర్ కొంగంటి సంపత్ కుమార్ మిక్కిలినేని మధుసూదన్ రావు జమున మొదలగు వారంతా కొన్ని సంవత్సరాల విరామం తర్వాత 1974 లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలిగా పూనం నిర్మాణం చేయబడింది ప్రజానాట్యమండలి ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజల సమస్యలు ఇతివృత్తాలుగా కళారూపాలు తయారుచేసి ప్రజలను మేలుకొలుపు కార్యక్రమాలను నిర్వహిస్తుంది ప్రజానాట్యమండలి భూమి సమస్య ఇతివృత్తంగా భూమి బాగోతం నృత్య నాటిక కొన్ని వేల ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది రచనలు యుగే యుగే నాటిక కీర్తిశేషులు మాదాల రంగారావు టి కృష్ణ గార్ల ఆధ్వర్యంలో అందరూ బ్రతకాలి సాంఘిక నాటకం నాగభూషణం ఆధ్వర్యంలో అనేక పట్టణాల్లో ప్రదర్శించడం జరిగినది ప్రజల గాథలు బాధలు పాటలుగా రూపొందించి చక్కని బాణీలతో అన్ని సందర్భాలలో రాష్ట్రవ్యాప్తంగా పాడుచున్నారు ప్రజానాట్యమండలి నాయకులు బుర్రకథ పల్లె సుద్దులు డప్పులు కోలాటం మొదలగు జానపద కళారూపాలను జీవనం చేస్తుంది ప్రజానాట్యమండలి ఆధునిక కళారూపం వీధి నాటికను ఒక సాధనంగా వద్దకు తీసుకెళ్తుంది ప్రజానాట్యమండలి ప్రస్తుతం మన రాష్ట్రంలో అన్ని జిల్లాలలోనూ ప్రజానాట్యమండలి తన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ మండల సీనియర్ నాయకులు తండా మొండయ్య సిపిఐ గ్రామ కార్యదర్శి వేముల కృష్ణకర్ సిపిఐ నాయకులు బిల్కూరు తులసి రామ్ ఎర్ర ప్రకాష్ రాజం రాజు ఎండి రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్ కు ఢీకొట్టిన కారు

ప్రమాదంలో అక్కడికక్కడే ఒకరు మృతి





**గొల్లపల్లి మే 14ప్రజా మంటలు అంకం భూమయ్య :**ఎండపల్లి మండలం కొత్తపేట కు చెందిన కోడి ప్రవీణ్, గోపాల మొగిలి, గోపాల రాజయ్య, తరాళ్ళ రాయమల్లు,ప్రవీణ్ కుమార్ కలిసి స్విఫ్ట్ డిజైర్ ా 15 జుణ 8688 లో హాజీపూర్‌కు పెళ్లికి వెళ్తుండగా, రాయపట్నం శివారులోని హనుమాన్ విగ్రహం సమీపానికి చేరుకున్న సమయంలో కారు డ్రైవర్ ప్రవీణ్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి నియంత్రణ కోల్పోయి రోడ్డుకు కుడి వైపున నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. పక్కనే ఉన్న యాక్టివా స్కూటీ హోండా షైన్ బైక్‌లను కూడా ఢీకొట్టాడు ప్రమాదంలో కారులో ముందు సీటులో కూర్చొని ఉన్న తరాళ్ళ రాయమల్లు తలకు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర రక్త గాయాలు అక్కడికక్కడే మృతి చెందాడు ప్రయాణిస్తున్న మిగతా వారికి కూడా గాయాలయ్యాయి.మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము.ఎస్ఐ,జి మహేష్ తెలిపారు

# తాటి వనంలో యువకుడి దారుణ హత్య

ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి



**ఎల్కతుర్తి మే 14 ప్రజా మంటలు** :ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తాటి వనంలో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన గురువారం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గౌడిశాల వినయ్ కుమార్ (30) ప్రతిరోజు లాగే తన వృత్తి అయిన కళ్ళు గీసే పనిలో నిమగ్నమై ఉన్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అక్కినేపల్లి అఖిల్ కళ్ళు కావాలని అడగగా వినయ్ కుమార్ కళ్ళు ఇచ్చాడు. అనంతరం అక్కడే కూర్చొని కళ్ళు తాగుతున్న అఖిల్ కొంతసేపటికి తరువాత విజయ్ కుమార్ తో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. తన భార్యతో అక్రమ సంబంధం ఉందంటూ ఆరోపిస్తూ తన వెంట తెచ్చుకున్న వేట కొడవలితో వినయ్ కుమార్ పై దాడి చేసినట్లు మృతుడి భార్య గౌడిశాల శ్వేత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దాడిలో తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో పడి ఉన్న విజయ్ కుమార్ ను గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి భార్య శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# బుగ్గారం పోలీసులకు సమాచార కమిషన్ నోటీసులు

విచారణకు హాజరు కావాలని ఆదేశాలు




**బుగ్గారం, మే 14 (ప్రజా మంటలు):**జగిత్యాల జిల్లా బుగ్గారం మండల పోలీస్ అధికారులకు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించే విచారణకు సమాచార కమిషన్ ముందు హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.ప్రముఖ ఆర్టీఐ కార్యకర్త, సీనియర్ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్ట్ చుక్క గంగారెడ్డి గతంలో రెండు వేర్వేరు దరఖాస్తుల ద్వారా పోలీస్ అధికారులను సమాచారం కోరారు. అయితే బుగ్గారం, ధర్మపురి సర్కిల్ పోలీస్ అధికారులు సమాచారం ఇవ్వడంలో విఫలమయ్యారనే ఆరోపణలతో ఆయన తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు.చుక్క గంగారెడ్డి దాఖలు చేసిన రెండు వేర్వేరు అప్పీల్ కేసులపై విచారణ చేపట్టనున్న కమిషన్, సంబంధిత పూర్తి సమాచారం మరియు ప్రతులతో సహా హాజరు కావాలని పోలీస్ అధికారులను నోటీసుల్లో ఆదేశించింది.

# నేపాల్ పౌరులకు పోలీసుల గట్టి వార్నింగ్

నేరాలకు పాల్పడితే ఖబడ్దార్!



**సికింద్రాబాద్, మే14 ( ప్రజామంటలు):** నగరంలో పెరుగుతున్న నేరాలను అరికట్టే క్రమంలో చిలకలగూడ పోలీసులు కీలక అడుగు వేశారు. డివిజన్ పరిధిలోని వివిధ అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్లుగా, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న నేపాల్ దేశస్తులను పిలిపించి గురువారం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని, పోలీసులు ఈ అప్రమత్తత చర్యలు చేపట్టారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, జైలు శిక్ష తప్పదని ఈ సందర్భంగా పోలీసులు గట్టిగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ నరసయ్య మాట్లాడుతూ.. తమ పరిధిలో నివసిస్తున్న విదేశీ పౌరుల ప్రతి కదలికపై నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. చిలకలగూడ డివిజన్ పరిధిలో ప్రస్తుతం 45 మంది నేపాల్ పౌరులు ఉన్నట్లు గుర్తించామని, వారి పూర్తి వివరాలతో పాటు ఐడీ ప్రూఫ్‌ను సేకరించామని వెల్లడించారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని వారికి సూచించారు. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, ఎస్హెచ్ఓలు రామకృష్ణ, రాజేందర్ గౌడ్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

